వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 07 నవంబర్ 2024



కాబినేట్ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

## యువకుడి దారుణ హత్య

రైల్వే కోడూరు అర్బన్, నవంబర్06,ప్రభాతవవార్త :



కోడూరు మండలంలోని రెడ్డివారిపల్లె చెరువు గట్ల మీద చియ్యవరం వేళ్లే దారిలో బుధవారం ఉదయం అటువైపుగా వెళుతున్న రైతులకు ఒక గుర్తు తెలియని వ్యక్తి రక్తపు మడుగులలో పడిపోయి ఉండటాన్ని గమనించి పోలీసుకలు సమాచారం ఇచ్చారు. పిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులు గొంతు కోసి చంపారని, ఆ వ్యక్తి పేరు పితాని వెంకటరమణగా (40) గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోనికి వెళితే ఇతను తూర్పుగోదావరి జిల్లానివాసి అని వైకోటలో పెళ్లి చేసుకున్నాడని, టైల్స్, మార్బుల్స్ పని చేస్తున్నాడాని, కొంత కాలం మస్కట్‌లో, అనంతపురంలో ప్రస్తుతం కోడూరులో పని చేసుకుంటూ ఉండేవాడని, కొంతకాలంగా కుటుంభ కలహాలు కూడా ఉన్నాయని, ఆ కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నామని ఏ విషయం దర్యాప్తులో తేలాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

# వర్రాతో బోర్లపడిన ఎస్పీ

- సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రులపై అసభ్యకరంగా పోస్ట్ పెట్టారన్న ఆరోపణలతో వర్రాను అదుపులోకి తీసుకున్న చిన్నచౌకు పోలీసులు
- 41 నోటీసుతో అరెస్టు చేసి వదిలేసిన వైనం
- ఎంపీ అవినాష్‌రెడ్డి ఫోన్‌తో వదిలేశారన్న ఆరోపణలు?
- ఎస్పీపై బదిలీ వేటు
- సస్పెన్షన్‌కు గురైన చిన్నచౌకు సీఐ తేజోమూర్తి
- 4 నెలలు గడవక ముందే బదిలీ వేటు పడ్డ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు
- ఇన్‌ఛార్జి ఎస్పీగా అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు



కడప క్రైం, నవంబరు 6, ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోం మంత్రి అనితలపై అసభ్యకర పోస్టులు పెట్టారన్న నెపంతో వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డిని అరెస్టు చేసి వదిలేసిన వైనంలో జిల్లా ఎస్పీ బొక్కా బోర్ల పడ్డాడు. వర్రా రవీంద్రారెడ్డిని అరెస్టు చేసి ఎలాంటి చర్యలు తీసుకోకుండా కకేవలం 41 నోటీసుతోనే సరిపెట్టారన్న నెపంతో రాష్ట్ర అధినాయకత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. 24 గంటలు గడవకముందే ఎస్పీపై వేటు పడింది. ఆయన్ను బదిలీ చేస్తూ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన్ను డీజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకపోగా ఇన్‌ఛార్జి ఎస్పీగా అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును ప్రభుత్వం తాత్కాలిక ఎస్పీగా నియమించింది. ఈ డ్రామా వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలిలా ఉన్నాయి. పులివెందులకు చెందిన వర్రా రవీంద్రారెడ్డి పులివెందులలోని నారాయణ స్కూలు సమీపంలోని మైత్రీ లేఅవుట్‌లో నివాసం ఉంటున్నాడు. ఈయన స్వస్థలం వేముల మండలం. అయితే వైసీపీలో సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి అనితలపై గతంలో ఈయన సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టాడన్న ఆరోపణలపై కేసు నమోదైంది. స్వయానా సీఎం, డిప్యూటీ సీఎంలపై పోస్టులు పెట్టినా పోలీసులు పట్టించుకోకపోవడంతో అధినాయకత్వం సీరియస్ అయింది. పార్టీ ఆదేశాల మేరకు అతన్ని రవీంద్రారెడ్డిని జిల్లా ఎస్పీ ఆదేశాలతో చిన్నచౌకు సీఐ తేజోమూర్తి వారి సిబ్బంది మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అయితే అతనిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోకుండా కేవలం 41 నోటీసుతోనే విచారించి వదిలేశారన్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుపై బదిలీ వేటు పడింది. ఈ వ్యవహారంలో చిన్నచౌకు సీఐ తేజోమూర్తిపై సస్పెన్షన్ వేటు పడింది. దీనికి సంబంధించి పలు రకాల ఆరోపణలు వినిపిస్తున్నాయి. కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫోన్ చేసి రవీంద్రారెడ్డిని వదిలేయాలనడంతోనే సీఐ తేజోమూర్తి అతన్ని వదిలేశాడని తెలుస్తోంది. సాక్షాత్తు సీఎం డిప్యూటీ సీఎంలపై పోస్టులు పెట్టినా చర్యలు ఏంటని పలువురు ప్రశ్నించడంతో పాటు కిందిస్థాయి వారు పార్టీ కోసం ఎన్నో కేసులు పెట్టించుకొని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడిన కార్యకర్తల మాటేంటని ఎస్పీపై టీడీపీ నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. అంతేకాకుండా సోమవారం జరిగిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు బలంగానే ఆయనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తి ఇన్‌ఛార్జి మంత్రికి ఆయనపైన తమ గోడును వినిపించారు. తమ మాట వినకపోవడంతో పాటు గతంలో తమపై దాడులు చేసి కేసులు పెట్టిన వారిపై ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఆరోపించారు. ముఖ్యంగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి గత వైసీపీ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా పనిచేసిన అంజాద్‌బాషా సోదరుడు తనను మహిళ అని కూడా చూడకుండా అసభ్యపదజాలంతో దూషించి తన ఇంటిపై దాడి చేస్తానని బెదిరించిన విషయంలో ఫిర్యాదు చేసినా ఎస్పీకి చీమ కుట్టినట్లు కూడా లేదని ఇన్‌ఛార్జి మంత్రి ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. 24 గంటలు గడవకముందే రవీంద్రారెడ్డి విషయంలో ఎస్పీ ప్రవర్తించిన తీరు తీసుకున్న నిర్ణయంపై ఎట్టకేలకు ఎస్పీ ఈతతంగంలో బోర్లా పడ్డాడు. ఆయనతో పాటు సీఐ తేజోమూర్తిపై సస్పెన్షన్ వేటు పడింది. సీఐ గతంలో బదిలీపై వస్తున్న తరుణంలో పలు ఆరోపణలు వినిపించాయి. ఈయన అవినీతి తారా స్థాయికి చేరిందని అతనికి ఇక్కడ సీఐగా ఎలా ఇస్తారని గత ప్రభుత్వానికి చెందిన ఓ పత్రికలో ఇతనిపై పలు రకాల కథనాలు వెలువడ్డాయి. అయినప్పటికీ ప్రస్తుత తెదేపా నాయకుల అభ్యర్థనతో తేజోమూర్తికి చిన్నచౌకు పీఎస్‌లో పోస్టు దక్కింది. అయినప్పటికీ ఆయన వైసీపీ నాయకులకు అనుగుణంగా పనిచేస్తున్నట్లు ఆరోపనలు వినిపించాయి. ఈ నేపథ్యంలో రవీంద్రారెడ్డి కుటుంబ సభ్యులను కూడా మంగళవారం ఉదయం స్థానిక రూరల్ పీఎస్‌లో ఉంచి సాయంత్రం విచారించి ఆయనను వదిలేశారు. ఈ వ్యవహారంలో ఎస్పీకి బదిలీతో పాటు చిన్నచౌకు సీఐ తేజోమూర్తి సస్పెన్షన్‌తో ముగిసింది.

### నిద్రలో నిఘానేత్రం

# ఆదమరిస్తే అంతా దోపిడే

రాజంపేట, నవంబర్ 06,(ప్రభాత వార్త :



రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో రోజురోజుకు ఇళ్లల్లో చోరీలు, దారుల్లో దోపిడీలు అధికమయ్యాయి. గత రెండు నెలల నుంచి ఈ నియోజకవర్గాల్లోని ప్రాంతాల్లో వారానికి ఒకటి రెండు చోరీలు దారి దోపిడీలు దొంగతనాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి దోపిడీ దారులను దొంగలను పట్టుకునేందుకు పట్టణాల్లోనే కాదు హైవే రోడ్లపైన రోడ్ల మలుపుల వద్ద నిఘా నేత్రాలైన సిసి కెమరాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ప్రజలు, కొన్ని ప్రైవేటు సంస్థలు కూడా విరివిగా విరాళిలిచ్చి ఆరాచకాలను, దొంగతనాలను, నేరస్తులను పట్టుకునేందుకు సహకరించారు. అయితే గత కొద్ది రోజులుగా ఈ నిఘా నేత్రానికి బాగా నిద్ర పట్టినట్లు తెలుస్తోంది. దీంతో పట్టణ ప్రాంతాల్లోనూ, అలకంగా దొంగతనాలు జరుగుతున్నాయి. ఇటీవల కోడూరు పట్టణంలో ఇళ్లలోకి జొరబడి తలుపులు పగులగొట్టి చోరీ చేస్తే రాజంపేట పట్టణంలో పట్టపగలే ఇలాంటి దొంగతనాలకు తెగబడ్డారు. వీటి నుంచి తేరుకోక ముందే దొంగలు పట్టణాల్లోనే బ్యాంకుల వద్ద నిఘా పెట్టారు. ఈ నెల 2వ తేదీన తర్వాత రెండు రోజులు బ్యాంకుల వద్ద దొంగలు ముఠా నిఘా పెట్టి బ్యాంకుల్లో కట్టేందుకు, పెట్టేందుకు తీసుకువెళ్లే బంగారు నగలు, నగదును ఆదేవిధంగా బ్యాంకుల నుంచి డ్రా చేసుకొని అక్కడ ఉన్న తాకట్టు లో ఉన్న బంగారును విడిపించుకొని తీసుకెళ్లేవారిని పసిగట్టి దోపిడీ దారులు అమాంతం దోచుకొని పోతున్నారు. దీంతో ఇప్పటికే లక్షలాది రూపాయలు డబ్బులు, వందల గ్రాముల బంగారాన్ని దోపిడీకి గురి కావడం జరిగింది. దీంతో బ్యాంకుల అధికారులే ఖాతాదారుల పట్ల అనేక జాగ్రత్తలు చూసించడం జరుగుతుంది. రాజంపేట పట్టణంలో గత కొద్ది రోజుల నుంచి రాత్రులే కాదు పట్టపగలే బ్యాంకుల వద్దే ఇలాంటి చోరీలు జరుగుతున్నా నిఘా నేత్రాలు వాటిని పసిగట్టలేక పోతున్నట్లు తెలుస్తోంది. దీనికి కారణం పట్టణంలోని ఏర్పాటు చేసిన సిసి కెమరాలు మరమ్మత్తులకొచ్చనట్లు తెలుస్తోంది. వీటిని తక్షణం రిపేర్లు చేయించి నిఘా పెట్టి దోపిడీలకు పాల్పడుతున్న దొంగలను పసిగట్టి వాటిని అరికట్టి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### రాబోయే 3 రోజుల్లో జిల్లాలోని 5.48లక్షల గృహాలకు

# జియో ట్యాగ్ పూర్తి చేయాలి

- నవశకం పోర్టల్‌లో ఆధార్ బ్యాంకు లింకేజీ పూర్తి చేయాలి
- పల్లె పండగలో చేపట్టిన పనులు వంద శాతం గ్రౌండ్ పూర్తి కావాలి
- విద్యార్థులకు అపార్ ఐడీ త్వరితగతిన జనరేట్ చేయాలి
- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, నవంబరు 6, ప్రభాతవార్త:



రాబోయే మూడు రోజుల్లో జిల్లాలోని 5.48లక్షల గృహాలను సచివాలయ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన జియో ట్యాగ్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్ నుంచి ఎంపీడీవోలు, డ్వామా ఏపీడీలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో 3 రోజజుల్లోపు మంజూరైన ప్రతి గృహంతో పాటు వాటి ఇంటి నెంబర్లు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. నవశకం పథకానికి సంబంధించిన ఎన్పీసీఎల్ ఇన్‌ఆక్టివ్ ఉన్న లబ్ధిదారులందరికీ బ్యాంక్ ఖాతాలను తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేయించాలని సూచించారు. పల్లె పండగలో చేపట్టిన పనులు వంద శాతం గ్రౌండ్ పూర్తి కావాలని సూచించారు. చేపట్టిన ప్రతి పనిని నాణ్యతగా డిసెంబరు మాసంలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అపార్ ఐడీ త్వరితగతిన జనరేట్ చేయాలి. పంచాయతీ సెక్రటరీలు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రతి స్కూలు సందర్శించి ఎంత మందికి అపార్ ఐడీ ఉంది ఎంత మందికి లేదని పరిశీలించి ఐడీ లేని వారికి అపార్ ఐడీ క్రియేట్ చేయడానికి కృషి చేయాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి కల్పన, వ్యక్తిగత కమ్యూనిటీ సోక్ పిట్స్ తదితర అంశాలలో ప్రగతిలో వెనకబడిన వారితో మండలాల వారీగా సమీక్షించి ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటరత్నం, పీఆర్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీపతి, ఎంపీడీవోలు, ఏపీడీలు, పంచాయతీ కార్యదర్శులు మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కాపాడే దిక్కు ఎవరు

- అనర్హులకు పొజిషన్ సర్టిపికెట్లతో ప్రభుత్వ భూమి స్వాహా
- రెవెన్యూ అధికారుల మాయాజాలం

సంబేపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న భూ ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఆక్రమణదారులు కూడా కొత్త దారులను ఎంచుకుంటున్నారు. రెవెన్యూ అధికారులకు కూడా ఇబ్బందులు లేకుండా అనర్హులకు కూడా పొజిషన్ సర్టిఫికెట్లతో భూములు దక్కుతున్నాయి. రాయచోటి జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి ప్రభుత్వ భూములను కాపాడే దెవరు అనే సందేహం కలుగుతోంది. సంబేపల్లి మండలం జిల్లా కేంద్రానికి 10 కి.మీ దూరం ఉండడంతో అందులో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న భూములకు మంచి గిరాకీ ఉంది. చోటా మోటా నాయకుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. ఎలాగైనా 5 లేదా 10 సెంట్లు స్వాధీనం చేసుకోవాలి. అందుకోసం కొత్త పద్ధతి కనిపెట్టారు. హౌసింగ్ పొజిషన్ పేరుతో గాలం వేశారు. ఈ భూమి జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ప్రజా ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవాల్సిన ఈ భూమిని పొజిషన్ సర్టిఫికెట్స్ పేరుతో ఆక్రమించేశారు. దీనికి రెవెన్యూ అధికారులు అండదండలు బలంగా ఉన్నాయి. గతంలో ఉన్న తహసీల్దారు లక్షల్లో నాయకుల దగ్గర డబ్బులు తీసుకొని పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేసినట్లు ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**హౌసింగ్ పొజిషన్ సర్టిఫికెట్లను సిద్ధం చేసిన భూమి ఇదే..**

సంబేపల్లె మండలం మోటకట్ల పంచాయతీ కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి 467 సర్వే నెంబరులో 40 సెంట్లు ప్రభుత్వ భూమి జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆర్ఎస్ఆర్‌లో డాక్టర్ ల్యాండ్ అని ఉంది. ఈ భూమిని హౌసింగ్ పొజిషన్ సర్టిఫికెట్లను కొంత మందికి అనర్హులకు రెవెన్యూ అధికారులు కట్టబెట్టారు. రెవెన్యూ అధికారులు అందజేసిన పొజిషన్ సర్టిఫికెట్లలో కూడా ఫోర్జరీ సంతకాలున్నాయి. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడే అధికారులే ప్రభుత్వ భూములను మట్టు పెడుతున్నారు. ప్రస్తుతం శరవేగంగా ఆ భూమిని చదును చేస్తున్నారు. ఏ సమయం ఎలా వస్తుందో ఏమో ముందు చదును చేసి ఆక్రమించుకోవాలని అడ్డదారిలో పొజిషన్ సర్టిఫికెట్లు పొందిన వారు కాస్త వేగం పెంచారు. సంబంధిత రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతు అంతా జరుగుతోందని మండలంలో చర్చించుకుంటున్నారు. ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని నిక్కచ్చిగా విచారణ జరిపిస్తే నిజా నిజాలు వెలుగులోకి వస్తాయి. ఏ మేరకు స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఈ విషయమై తాసిల్దార్ ను వివరణ కోరగా రికార్డులను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు

## రబీ టమోటాకు వాతావరణ ఆధారిత క్రాప్ ఇన్సూరెన్సు

**జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు**

పీలేరు, నవంబరు 06 ప్రభాతవార్తః



ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వాల్మీకిపురం, కలికిరి, కలకడ, కేవి.పల్లె, గుర్రంకొండ, పీలేరు మండల ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు స్థానిక కషివిజ్ఞానకేంద్రం కలికిరి నందు రబీ సీజనల్ 2024-25 టమోటా పంట బీమాపై అవగాహన శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలలో టమోటా జిల్లాలో రెండవ ప్రధానమైన పంట రబీ సీజ్‌లో టమోటా సాధారణ విస్తీర్ణం 4000 ఎకరాలు కావున అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు నాటే టమోటా పంటలకు వాతావరణ పరిస్థితుల్లో మార్పుల వల్ల పంట నష్టం జరిగితే రైతులకు అండగా నిలవాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం రబీ సీజన్‌లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. కావున రైతులందరూ ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్సు కంపెనీని ఎంపిక చేశారన్నారు. రబీ సీజన్‌లో అంటే అక్టోబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు పంట సాగు చేసిన రైతులు ఎకరానికి 1600 చొప్పున ప్రీమియం చెల్లించినచో 32000 రూపాయలు పంట నష్టపరిహార భీమాను పొందవచ్చనని తెలియజేశారు. టమోటా పంటపై బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో అంగీకార పత్రాన్ని ఇచ్చినట్లయితే పంట రుణం నుంచి బ్యాంకు నేరుగా బీమా ప్రీమియంను చెల్లించుకుంటుంది. అలాగే పంట రుణం తీసుకుని రైతులు నేరుగా స్వచ్ఛందంగా కానీ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో కానీ లేదా మీగ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవాకేంద్రంలో కానీ మీ యొక్క భూమి 1బీ , ఆధార్, బ్యాంకు ఖాతా, పంట దవీకరణపత్రం సమర్పించి నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈకార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంజుల మాట్లాడుతూ ప్రస్తుత ఖర్చు తగ్గించి అధిక ఆదాయాన్ని పెంచేందుకు చేపట్టవలసిన పద్ధతులపై, ఎరువులపై అవగాహన కలినపంచారు. ఈకార్యక్రమంలో ఆర్‌బీకే, ఆర్ఎస్‌కే, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో కత్తితో దాడి

- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు

పులివెందుల, నవంబరు 6, ప్రభాతవార్త ః



పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ పంచాయతీకి చెందిన కానేపల్లెలో కుటుంబ కలహాలతో గంగనపల్లె భాష కత్తితో దాడి చేసిన సంఘటనలో బండి సూరివీరయ్య, ఊడవగండ్ల బాషలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. బండి సూరి వీరయ్య అదే గ్రామంలో ఉండే గంగనపల్లె బాష కుమార్తెను వివాహం చేసుకున్నారు. అయితే వారిరువురి మధ్య విభేదాలు రావడంతో బండి సూరి వీరయ్య తన భార్యకు విడాకులు కావాలంటే కోర్టు ద్వారా నోటీసులు పంపించారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య విభేదాలు వచ్చాయి. మంగళవారం రాత్రి బండి వీరయ్య తన బంధువైన ఊడవగండ్ల బాసతో కలిసి గంగనపల్లె బాష ఇంటి వద్దకు వెళజ్ల ఘర్షణకు దిగాడని, దీంతో గంగనపల్లె బాష ఇంటిలో ఉన్న కత్తి తీసుకుని బండి సూరి వీరయ్యను, అతనితో వచ్చిన ఊడవగండ్ల బాసాపై కత్తితో పొడవడంతో ఇరువురికి గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు జోక్యం చేసుకుని ఇరువురిని విడిపించి గాయాలైన బండి సూరి వీరయ్యను, ఊడవగండ్ల బాషను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారని బాధితుల ఫిర్యాదు మేరకు గంగనపల్లె బాషాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నైపుణ్యం మరియు అభివృద్ధికి దారులు

-కెరీర్ లక్ష్యాలను సాధించడంపై అవగాహన

కడప,నవంబర్ 06,ప్రభాతవార్త:

కడప కె యస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాల లో (రిచర్డ్ కింగ్ చత్రగడ్డ,రీజనల్ హెడ్ - అకాడమిక్ అలియన్స్,టిసిఎస్ (గ్రూప్) ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ గారి చే రెడినేస్ టు ఇండస్ట్రీ ఎక్స్పోజర్ సెమినార్ బుధవారం కళాశాల ఆడిటోరియం లో 3 సంవత్సరం బిటెక్ విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రపంచం నిరంతరం మారుతూనే ఉంది. ఈ మార్పులు వ్యాపారాలుచవ్యక్తులు మరియు సంస్థలకి అనేక సవాళ్లను కలిగిస్తాయి -ఆర్థిక మార్పులు,సాంకేతిక అభివృద్ధులు సామాజిక మార్పులు మొదలైనవి. అయితే ఈ సవాళ్ల ద్వారా అనేక మంది అభివృద్ధికి,నైపుణ్యానికి మరియు పరివర్తనానికి అవకాశాలను కనుగొంటున్నారు. మార్పుకు అనుకూలంగా మారడం పరిశ్రమల్లో ప్రవేశించే ముందు కాలవల్సిన లైఫ్ స్కిల్స్ మరియు ప్రాజెక్టుల పనితీరు యువతకు కావాల్సిన నైపుణ్య శక్తి గురించి వివరించారు. ప్రధానంగా యువత ఎమోషనల్ స్మార్ట్ నెస్,అడ్వాన్స్డ్ నెట్వర్కింగ్ గైడెన్స్,పరిశ్రమ హార్డ్ మరియు సాఫ్ట్ స్కిల్స్ విజయవంతమైన కెరీర్ కు ముఖ్యమని వ్యాఖ్యనించారు. ఈ కార్యక్రమంలో డీన్ ఇండస్ట్రీ రిలేషన్స్ ఎం.వేణు గోపాల్ మాట్లాడుతూ పరిశ్రమలో నైపుణ్యాల పరిరక్షణ,చశక్తివంతమైన నెట్వర్కింగ్ మరియు కెరీర్ లక్ష్యాలను సాధించడం పై అవగాహన కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి,వైస్ ఛైర్మన్ కందుల మదన మోహన్ రెడ్డి,కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి,వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.ఎన్ ప్రసాద్,సీనియర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీ ఆర్.నాగరాజు,ప్లేస్మెంట్ కో ఆర్డినేటర్ సిద్దిక్,వివిధ డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్స్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధుని భూమి కాజేసిన వీఆర్‌ఏ

**భర్తపేరుతో వన్‌బీ భూమి నమోదు**

**బాధితుడు తహశీల్దార్‌కు ఫిర్యాదు**

కురబలకోట, నవంబర్ 6 ప్రభాతవార్త :



తన అనుభవంలో ఉన్న భూమిని మండలంలోని పిచ్చలవాండ్లపల్లె వీఆర్‌ఏ అక్రమంగా తన భర్త పేరిట వన్‌బీలో నమోదు చేసుకుందని బాధితుడు ఎల్.వెంకట్రాయప్ప బుధవారం తహశీల్దార్ తపస్వినికి ఫిర్యాదు చేశారు. వెంకట్రాయప్పకు తండ్రి కదిరప్ప పేరిట లక్కస ముద్రం గ్రామం బంతినగానిపల్లె వద్ద 2.34ఎకరాలు డికేటి భూమి ఉంది. ఇది వంశపారంపర్యంగా వస్తోంది. దీనిని 291 ఖాతానెంబర్‌తో పట్టాదారు పాసుబుక్కు కూడా ఇచ్చారు. ఇప్పటికీ ఇతని అనుభవంలోనే భూమి ఉంది. ఉలవల సాగు చేశాడు. ఊరిలో ఎవ్వరిని అడిగినా కూడా ఈ విషయం చెబుతారని బాధితులు తెలిపారు. ఇలాంటి భూమిని రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగులతో తనకున్న పలుకుబడితో వీఆర్‌ఏ తన భర్త పేరుతో 2023 అక్టోబర్‌లో511 ఖాతా నెంబర్‌తో ఆక్రమంగా వన్‌బీన చేసుకొందని తెలిపారు. ఇదివరలో ఇక్కడ పనిచేసిన ఓ తహశీల్దార్ ఉన్నప్పుడు ఇది జరిగిందని తెలిపారు. దీంతో బాధితుడు వెంకట్రాయప్ప తహశీల్దార్‌ను కలసి న్యాయం చేయాల్సిందిగా వినతిపత్రం ఇచ్చారు. విచారించి తన భూమిని తిరిగి తనకు ఇప్పించాల్సిందిగా కోరారు. లేదంటే తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహశీల్దార్‌ను విచారించగా ఈ విషయంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మధ్యంతర భృతిని ప్రకటించాలి

రాయచోటి, నవంబరు 6, ప్రభాతవార్త:



ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆతృతగా, ఆశగా ఎదురుచూస్తున్న మద్యంతర భృతిని వెంటనే విడుదల చేసేలా ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేయాలని శాసనమండలి సభ్యులు అశోక్‌బాబును ఎన్‌టీఏ రాష్ట్ర నాయకులు కొండూరు శ్రీనివాసరాజు కోరారు. బుధవారం విజయవాడలోని శాసన మండలి సభ్యుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వంపై ఎంతో ఆశతో, నమ్మకంతో ఉన్నారని వారు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము కాకుండా వీలైనంత త్వరగా వేతన సవరణ అమలయ్యేలా మధ్యంతర భృతి మరియు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని అదే విధంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న గత పీఆర్‌సీ బకాయిలు, కరవు భత్యం బకాయిలు, ఆర్థిక సెలవులు బకాయిలు, ఏపీజీఎల్ఐ, జెడ్పీపీఎఫ్ రుణాలు, అంతిమ చెల్లింపులు విడుదల చేసే విధంగా చొరవ చూపాలని కోరారు. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు అపార్ ఐడీ చేయడంలో చాలా ఒత్తిడికి గురవుతున్నారని, దీనికి మరింత సమయం పెంచి సరళీకృతం చేయాలని, రెసిడెన్షియల్ ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ నాయకులు, ఏబీ రామకృష్ణమరాజు, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

రాయచోటి, నవంబరు 6, ప్రభాతవార్త:

జిల్లా బాలల పరిరక్షణ విభాగ సిబ్బంది వారి ఆధ్వర్యంలో స్థానిక భారతి విద్య మందిర్ హైస్కూలు, రాయచోటిలో బాల బాలికలకు బుధవారం చట్టాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ బాల బాలికలకు బాలల హక్కుల గురించి తెలిపారు. పీఓ-ఐసీ రామలక్ష్మి మాట్లాడుతూ బాల బాలికల రక్షణ మరియు సంరక్షణ గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, 112, 100 గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ అనంతరెడ్డి మాట్లాడుతూ కుల మత బేధాలు ఉండకకూడదని మరియు సోదర భావంతో మెలగాలని, ఉన్నత స్థానాలను అధిరోహించాలని, క్రమశిక్షణ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ శైలజ, అవుట్ రిచ్ వర్కర్ ఆపిద, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## యాంటీ డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ



పీలేరు, నవంబరు 06 ప్రభాతవార్తః
నియోజకవర్గ పట్టణంలోని డ్రగ్స్ వల్ల ఇద్దరు విద్యార్థులు డ్రగ్స్ తీసుకుని ఇద్దరు మతిచెందిన సంఘటన చోటుచేసుకోవడంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో భాగంగా బ్రతక విద్యార్థికి యాంటీ ట్రస్ట్ అవగాహన కార్యక్రమాన్ని కరపత్రాలను పంపిణీ చేసిన రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సంపత్‌కుమార్, విద్యార్థులకు పలు సూచనలు తెలియజేశారు. అనంతరం వారికి కరపత్రాలను పంపినీ చేశారు. డ్రగ్స్ వల్ల విద్యార్థులకు కలిగే నష్టాలను, విద్యార్థులకు తెలియజేశారు,. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ విద్యార్థులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో సచివాలయ ఉద్యోగి మృతి

తొండూరు, నవంబరు 6, ప్రభాతవార్త ః



తొండూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.సుధీర్ అనారోగ్యంతో మృతిచెందారు. బంధువులు తెలిపిన మేరకు గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో మెరుగైన వైద్యం కోసం కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతుండగా బుధవారం మృతిచెందినట్లు వారు తెలిపారు. ఈయన మృతిపట్ల ఉద్యోగులు సంతాపం ప్రకటించారు.

## అభ్యసనా సామాగ్రి వితరణ



తొండూరు, నవంబరు 6, ప్రభాతవార్త ః
తొండూరు మండలంలోని అగడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, అమెరికాలో డాక్టర్‌గా స్థిరపడిన అగడూరుకు చెందిన అలవలపాటి బ్రహ్మంరెడ్డి రూ.10వేలు విలువైన స్టడీ మెటీరియల్స్ అందించారు. పాఠశాల అవసరాల నిమిత్తమై తగిన ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మంరెడ్డి దంపతులను ప్రధానోపాధ్యాయుడు బాబురెడ్డి, ఉపాధ్యాయులు శాలువాలతో సత్కరించారు.

## పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

### ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు



చిట్వేలి, నవంబర్ 6, ప్రభాతవార్త
చిట్వేలి మండలం లోని పలు గ్రామాలలో పారిశుధ్య పనులు అటకెక్కాయన్న విమర్శలు వినబడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పలుచోట్ల నిలిచిపోయిన నీటితో, అపరిశుభ్రతతో దోమల ఉధృతి అధికమైందని ప్రజలు వాపోతున్నారు. బ్లీచింగ్, ఫాగింగ్ లాంటి చర్యలు చేపట్టాల్సి న పంచాయతీ సిబ్బంది, పంచాయతీ సర్పంచులు మిన్నకుంటున్నారన్న విమర్శలు వినబడుతున్నాయి. సమస్యలు గుర్తించి అధికారులు చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున దోమలతో ప్రభలే సీజనల్ వ్యాధులకు ప్రజలు గురికాక తప్పదని ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య చర్యల కోసం మండల అభివృద్ధి అధికారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టి సీజనల్ వ్యాధుల నుంచి తమను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## టపాసులు అమ్మారు.. చెత్తను మరిచారు

చిట్వేలి, నవంబర్ 6, ప్రభాతవార్త



దీపావళి పండుగ రానే వచ్చింది. టపాసులు అమ్మకందారుల పంట పండింది. మూడు రోజుల వ్యవధిలో మూడు రెట్లు ఆదాయం అర్జించే వ్యాపారం టపాసులు అమ్మకం. చిట్వేలి గ్రామంలో 12 షాపులకు అనుమతి లభించింది. అనుమతి ఇవ్వడం తప్ప ధరలను పర్యవేక్షించి సామాన్యుడికి న్యాయం చేసిన అధికారులు ఎవ్వరు లేకపోవడం ఒక ఎత్తైతే, అందిన కాడికి దోచుకోవడం వ్యాపారులు ఎత్తయింది. గత ఏడాది మిగిలిన టపాసులను జోరుగా అమ్మారన్న విమర్శలు లేకపోలేదు. ప్రస్తుతం మిగిలిన టపాసులను ఎక్కడ ఉంచారన్న ప్రశ్నలు వినిపించాయి. ఇదంతా బాగానే ఉన్నా వ్యాపారం నిర్వహించిన ప్రాంగణంలో వేసిన చెత్తాచెదారం నిల్వలతో చుట్టుపక్కల ఉన్న నివాసకులు కలిగే ఇబ్బందిని పట్టించుకోరా అని బాధ్యులు వాపోతున్నారు. పరిశుభ్రత మరిచిపోవడం ఏమిటని,ఇదెక్కడి న్యాయం అని ప్రశ్నిస్తున్నారు. సత్వరమే అధికారులు స్పందించి వ్యాపారం నిర్వహించిన వారి ద్వారా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## టిడిపి సభ్యత్వంతో రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తింపు

కడప కార్పొరేషన్, నవంబర్ 6, ప్రభాతవార్త
టిడిపి సభ్యత్వం ఉన్నవారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి లు అన్నారు. బుధవారం కడపలో 9వ డివిజన్ కు చెందిన టిడిపి నాయకులు, శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఇతర నాయకులు వంద రూపాయలు రుసుము చెల్లించి తెదేపా సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సభ్యత్వాన్ని స్వీకరించడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని తెలిపారు. ఆరోగ్య, విద్యా, వైద్య పరంగా లబ్ధి చేకూరి రక్షణగా పార్టీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు అందూరి రాజగోపాల్ రెడ్డి, పాలెంపల్లి సుబ్బారెడ్డి, పాత కడప కృష్ణారెడ్డి, ఎద్దుల శంకర్, టిడిపి జిల్లా కార్యదర్శి జయ కుమార్, టిఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మాసాపేట శివ, శేఖర్, రంతుల పాల్గొన్నారు.



## జర్నలిస్ట్ కాలనీలో అభివృద్ధి పనులు పరిశీలించిన కమిషనర్



కడప కార్పొరేషన్, నవంబర్ 6, ప్రభాతవార్త
కడప నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మనోజ్ రెడ్డి బుధవారం కడప నగరంలో జర్నలిస్ట్ పార్క్, అన్నమయ్య సర్కిల్ ప్రాంతాలను ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జర్నలిస్ట్ పార్క్ లో జరిగిన పనుల నాణ్యతను పరిశీలించారు. పార్క్ లో గ్రీనరీ సమకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద మంగళవారం జరిగిన ఆర్టీసీ బస్సు యాక్సిడెంట్ అవడానికి కారణం..వాటికి సంబంధించిన మరమ్మతులను చేయాలని ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధనలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు మల్లేశ్వర్, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనానికి కొత్త హంగులు

సిద్దవటం, నవంబరు 6, ప్రభాతవార్త:
సిద్దవటం మండలం జంగాలపల్లి గ్రామ పంచాయతీ కమ్మపాలెం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి తెదేపా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి దశరథ నాయుడు రూ.15వేలు తన సొంత నిధులతో మరమ్మతులు చేశారు. 2010లో ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి తల్లిదండ్రులు కీర్తిశేషులు దారపునేని చెన్నయ్య నాయుడు, ధర్మపత్ని తిరుపతమ్మ జ్ఞాపకార్థం అంగన్‌వాడీ కేంద్ర భవనం చుట్టూ నూతనంగా పెయింటింగ్ పనులు, పిల్లలకు సంబంధించి చిత్రాలు సొంత నిధులతో సమకూర్చారు. ఈ సందర్భంగా మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి దశరథ నాయుడు మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని మా తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమం చేశామని మా రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్ఫూర్తితో ముందుకెళ్తున్నామని అంగన్‌వాడీ సిబ్బంది మమ్మల్ని ఘనంగా సత్కరించడం సంతోషకరమని పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి దశథ నాయుడు కుటుంబ సభ్యులు పిల్ల ల్లిదండ్రులు అంగన్‌వాడీ టీచర్ తిరుపతమ్మ, ఆయా గోపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

సిద్దవటం, నవంబరు 6, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం టక్కోలి ఎర్ర చెరువులో రైతుల పొలాల వద్ద మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని దీని ప్రభావం వల్ల పంట పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సుబ్బారెడ్డి బుధవారం పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎర్ర చెరువు కూత వేటు దూరంలో గ్రామ సచివాలయం సిబ్బంది ఉన్నా అక్రమ మట్టి తవ్వకాలు కట్టడి చేయలేదని మట్టి తవ్వకాలు జరిపి జిల్లా కేంద్రంలో ఒక్కో ట్రాక్టరు ధర రూ.4వేలకు విక్రయిస్తున్నారని మా పంట పొలాలు దెబ్బతింటున్నాయని అధికారులు తక్షణమే కట్టడి చేసి మా పొలాలు కాపాడాలని ఆయన కోరారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు మాధవీలతను మట్టి తవ్వకాలపై వివరణ కోరగా ఎర్ర చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరగకుండా కట్టడి చేస్తామని ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని ఆమె చెప్పారు.

## సమస్యల పరిష్కార దిశగా కూటమి ప్రభుత్వం



సిద్దవటం, నవంబరు 6, ప్రభాతవార్త:
సిద్దవటం మండలం మాధవరం గ్రామ పంచాయతీలోని మహబూబ్ నగర్ లోని మసీదు వీధిలో ఉన్న మురికి నీటి డ్రైనేజీ కాలువని తొలగించడానికి చర్చ జరిగింది. ఈ చర్చలో నియోజకవర్గం టీడీపీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డా.నాగూర్ వీరభద్రుడు చొరవతో మహబూబ్‌నగర్‌లోని పెద్దలు, గ్రామ ప్రజలు సంతకాల సేకరణ జరిపి పంచాయతీ ప్రెసిడెంట్ జానకీరామయ్యకు సెక్రటరీ లక్ష్మీ నరసయ్య సమక్షంలో డ్రైనేజీ కాలువను తొలగించమని వినతిపత్రం అందివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ జానకీరామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు రాక అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలను చేయలేకపోయామని, కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీకి నిధులు వచ్చాయని, వెంటనే డ్రైనేజీ సమస్యలను తీరుస్తానని తెలిపారు. ఇకపై ఎలాంటి సమస్యలు ఉన్నా కూటమి నాయకులతో కలిసి సమస్యలను తీరుస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు డా.వీరభద్రుడు, గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ అవ్వారు జానకీ రామయ్య, గ్రామ పంచాయతీ సెక్రటరీలు లక్ష్మీ నరసయ్య, నాన్సీ, టీడీపీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పెగడ హరిప్రసాద్, టీడీపీ బూతు ఇన్‌ఛార్జిలు చెన్నకేశవులు, కరిముల్లా బాషా, ఆ వార్డు మెంబర్ అవ్వారు అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, టీడీపీ యూత్ మామిళ్ల మురళీ, మహబూబ్‌నగర్ గ్రామ పెద్దలు మౌలాలి, మహబూబ్ బాషా, ఖాసీం, మహ్మద్ అలీ, మౌలా, గ్రామ ప్రజలు, యూత్ పలువురు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం

తంబళ్లపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:
ప్రభుత్వం తంబళ్లపల్లె మండలం కరువు ప్రాంతంగా ప్రకటించిన దృష్ట్యా స్థానిక కూలీల వలస నివారణకు ఉపాధి పనులు వేగవంతం చేస్తున్నట్లు ఏపీవో అంజనప్ప పేర్కొన్నారు. మండలంలోని 21 పంచాయతీలలో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించి కూలీలకు విరివిగా పనులు కల్పించడానికి పనులు గుర్తించాలని సూచించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామ సభలలో రైతులకు పండ్ల తోటల పెంపకం, పశుగ్రాసం పెంపకం, సిరికల్చర్, కూలీలకు చెరువుల్లో పూడికతీత పనులు, ట్రెంచీలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం కార్యక్రమాలకు కూలీల నుంచి చేయాల్సి న పనుల నివేదికలు సేకరించినట్లు చెప్పారు. త్వరలో తంబళ్లపల్లె మండలంలో ప్రతి ఉపాధి హామీ కూలీకి పని కల్పించడమే లక్ష్యంగా చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఉపాధి హామీ కూలీలు కరవు నివారణ పనులలో ముమ్మరంగా పాల్గొని లబ్ధిపొందాలని సూచించారు. ఈ గ్రామసభల నిర్వహణలో ఈసీ రామన్న, టెక్నికల్ అసిస్టెంట్లు శంకర, శేఖరమ్మ, నాగార్జున, వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



## ముమ్మరంగా వాహనాలు తనిఖీ

సంబేపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:
సంబేపల్లె మండలంలో ఎస్సై భక్తవత్సలం బుధవారం తన సిబ్బందితో ముమ్మరంగా వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని వాహనాలకు హెల్మెట్ ధరించని వారికి సుమారు 10 వాహనదారులకు జరిమానా విధించామన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఫోర్ వీలర్ వాహనదారులు సీటు బెల్టు, టు వీలర్ వారు హెల్మెట్లను తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనాల తనిఖీలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విరివిగా ఉలవల సాగు

తంబళ్లపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:
మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం పంపిణీ చేసిన సబ్సిడీ ఉలవల పంట సాగు రైతులు చేపట్టారు. మండలంలోని తంబళ్లపల్లె, గుండ్లపల్లె, ఎర్రసానిపల్లె, పంచాలమర్రి, గోపిదిన్నె, కోసువారిపల్లె, బాలిరెడ్డిగారిపల్లి, కోటకొండ, కుక్కరాజుపల్లి, రేణిమాకులపల్లి, కన్నెమడుగు, పరసతోపు, జుంజురపెంట పంచాయతీలలో ఉలవల పంట సాగు బాగుందని వ్యవసాయ విస్తరణాధికారులు తెలిపారు.



## సర్వశిక్ష అభియాన్ శిక్షణను వెంటనే రద్దు చేయాలి

పీలేరు, నవంబరు 06 ప్రభాతవార్తః
సర్వశిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాయకత్వ శిక్షణ గురువుల పాలిట శిక్షణగా మారిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదాశివరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1,2 వ తరగతులు బోధించే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఇచ్చే ఎఫ్ఎల్ఎన్‌శిక్షణను వెంటనే రద్దుచేయాలని యూటీఎఫ్ తరఫున డిమాండు చేస్తున్నామన్నారు. అరాకొర వసతులతో వారం రోజులు మారుమూల ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారని 50 ఏళ్ల వయస్సు పై బడిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు రెసిడెన్షియల్ తరహా శిక్షణ తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకుండా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదన్నారు. శిక్షణకు వచ్చే గురువుల్లో బీపీ ,షుగర్, గుండె జబ్బులు, మూత్ర పిండ వ్యాధులతో బాధపడేవారు, మహిళలు ఉన్నారనిదీంతో వారు ఈశిక్షణ కార్యక్రమానికి హాజరు కావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. తూర్పు గోదావరిలో శిక్షణలో ఉన్న ఓ హెచ్ఎం మతిచెందడం బాధాకరమని పేర్కొన్నారు. అధికారులు ప్రపంచ బ్యాంక్ నిధుల కోసమని ఈవిధంగా ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టి చంపడం శోచనీయమన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని హెచ్ఎం ఉపాధ్యాయులపై ఇలాంటి శిక్షణలు రుద్దడం సరికాదని గమనించి రద్దు చేయాలని కోరారు. ఇది శిక్షణగా కాకుండా ఉపాధ్యాయులకు శిక్షగా మారిందని దీన్ని రద్దుచేయాలని కోరుతున్నామని పీలేరు యూటీఎఫ్ డివిజన్ డిమాండు చేస్తూందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, సుధాకర్, వేణుగోపాల్‌శెట్టి, సుబ్రమణ్యం, కష్ణమూర్తి, విజయకుమార్, ఉదయ్‌కిరణ్, విజయ్, మహేంద్ర, చెంగారెడ్డి, మహమ్మద్‌రఫీ జిల్లా కార్యదర్శులు అక్రంబాష తదితరులు పాల్గొన్నారు.



## సమిష్టి కృషితో వైసీపీని బలోపేతం చేద్దాం

రాయచోటి, నవంబరు 6, ప్రభాతవార్త:



సమిష్టి కృషితో వైసీపీని బలోపేతం చేద్దామని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం ఎర్రమరెడ్డిగారిపల్లెలోని స్వగృహంలో జరిగిన రాయచోటి మున్సిపాలిటీ వైసీపీ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్యకర్తలకు, నాయకులకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమం

పెండ్లిమర్రి, నవంబరు 6, ప్రభాతవార్త:





పెండ్లిమర్రి మండలం మొయిళ్ల కాల్వ రామాపురం గ్రామాల్లో బుధవారం పెండ్లిమర్రి వ్యవసాయాధికారి జి.పి.ఓబులేసు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులు వ్యవసాయాధికారులు ఇచ్చే సూచనలు పాటించి పంటలు సాగు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలు ఈకేవైసీపీ చేసుకోవాలని తెలిపారు. ఇలా చేసుకోవడం వలన ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు బ్యాంకు ద్వారా రుణాలు నేరుగా రైతులకు వారి ఖాతాలో జమ అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సుధీర్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## మండలం అభివృద్ధికి కృషి చేయాలి

పెండ్లిమర్రి, నవంబరు 6, ప్రభాతవార్త:





ప్రతి ఒక్కరూ పెండ్లిమర్రి మండలం అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ బాలయ్య ఎంపీపీ వరలక్ష్మీలు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మండల అభివృద్ధికి కృషి చేయాలని వారు తెలిపారు. అలాగే మండల స్థాయి అధికారులు అందరూ ఒక్కొక్క శాఖ గురించి వివరించారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలో సీసీ రోడ్లు మంజూరయ్యాయని వారికి అందరూ సహకరించాలన్నారు. గ్రామ డ్రైనేజీకి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దారు అనురాధ, సర్పంచులు, ఎంపిటీసీలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెన్నానదిలో శవం లభ్యం - ఎస్సై చిరంజీవి

సిద్దవటం, నవంబరు 6, ప్రభాతవార్త:
సిద్దవటం మండలం వంతాటిపల్లి పెన్నానది సమీపాన బుధవారం సాయంత్రం మణికంఠ(13) శవం లభ్యమైందని మండల ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరానికి చెందిన మణికంఠ శవంగా గుర్తించామని ఆయన తెలిపారు.

## ఫసల్ భీమా ప్రీమియంను ప్రభుత్వమే తక్షణం చెల్లించాలి

ఖాజీపేట, నవంబర్ 06, ప్రభాతవార్త:



నమోదైన వర్షపాతం నెలవారీగా భూమి లోపల ఉన్న నీటి లభ్యత ఆధారంగా, మండలాన్ని కరువు యూనిట్‌గా పరిగణలోకి తీసుకొని కరువు మండలాలను ప్రకటిస్తుండటంతో రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, అలా కాకుండా వర్షపాతం నమోదుకు సచివాలయ పరిధిని యూనిట్‌గా తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ నేత, ఏపీఎస్ఆర్టీసి మాజీ జోనల్ చైర్మెన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఖాజీపేట మండలం, దుంపలగట్టు గ్రామంలోని ఆయన స్వగృహంలో బుధవారం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మాత్రమే వర్షపాత నమోదు కేంద్రం(రెయిన్ గేజ్) ఉంటుందన్నారు. మండల పరిధి భౌగోళికంగా 40, 50కిలోమీటర్ల విస్తరించి ఉన్నందున మండల పరిధిలో చాలా చ ఓట్ల వర్షం పడకపోయిన కేవలం మండల కేంద్రంలో వర్షం పడితే ఆ లెక్కలను పరిగణలోకి తీసుకోవడంతో రైతాంగానికి తీరని అన్యాయం జరుగుతోందన్నారు. అలా కాకుండా గ్రామ సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుంటే వాస్తవాలు ప్రతిబింబిస్తాయని తద్వారా రైతాంగానికి మేలు జరుగుతుందని ఆయన సూచించారు. వైఎస్ఆర్ జిల్లాలోని కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, లింగాల, చక్రాయ పేట, సింహాద్రిపురం, తొండూరు తదితర మండలాలు ఎప్పుడు తక్కువ వర్షపాతం నమోదు అవుతున్నప్పటికి జిల్లాలో ఏ ఒక్క మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులకు అన్యాయానికి గురవుతుందని ఆవేదన వ్యక్తంపరిచారు. ప్రధాని ఫసల్ భీమా యోజన ప్రీమియంను గతంలో వైయస్ జగన్ ప్రభుత్వం రైతాంగం పక్షాన చెల్లించిందని కానీ కూటమి ప్రభుత్వం ఖరీఫ్‌లో చెల్లించలేదని రబీలో రైతాంగమే చెల్లించాలని ఆదేశించడం రైతాంగాన్ని వంచించడమే అని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అన్నదాన సుఖీభవ కింద 20,000 ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి ఇంతవరకు అంటే రబీ సీజన్ మొదలైనా ఆ ఊసే లేదని ఆవేదన వ్యక్త పరుస్తూ తక్షణం పెట్టుబడి సాయం అందించాలని రెడ్యం డిమాండ్ చేశారు.

## రాజంపేట ఉపాధ్యాయులకు యుటిఎఫ్ కమిటీల్లో కీలక పదవులు

రాజంపేట అర్బన్, నవంబర్ 06, ప్రభాతవార్త:





రాజంపేట మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఇద్దరికి యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా స్థాయిలో కీలక పదవులకు ఎన్నికయ్యారు. మదనపల్లెలో జరిగిన జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో రాజంపేట మండలం జడ్పీ హైస్కూల్ చెర్లోపల్లె పాఠశాలలో సహ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న డి.చెంగల్ రాజు రాష్ట్ర కౌన్సిలర్ గాను, మందపల్లి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకట సుబ్బయ్యను జిల్లా కార్యదర్శిగాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపార్ ఐడి జనరేట్ చేయడంలో ఉపాధ్యాయులను తొందర పెట్టి మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని కోరారు. లీడర్‌షిప్, ఎఫ్ఎల్ఎం రెసిడెన్షియల్ శిక్షణలను తక్షణం రద్దు చేసి నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో జరపాలని కోరారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు తక్షణం మధ్యంతర భృతికి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు నెలవారీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## మాట నిలుపుకున్న కూటమి ప్రభుత్వం

ముద్దనూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని బొందలకుంట బసవేశ్వర దేవాలయం నందు బుధవారం నాడు జమ్మలమడుగు నియోజకవర్గ అర్చక సంఘం సభ్యుడు బొందలకుంట అనిల్ స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్చకులకు పదివేల రూపాయలు ఇవ్వాలని గత నెల జీవోను విడుదల చేసి హామీ నిలబెట్టుకున్న సంధర్భంగా జమ్మలమడుగు నియోజకవర్గ అర్చకులు తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కూడ ఆంధ్రప్రదేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్చకులకు 5000రూపాయలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వములో అర్చకులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని ఈ సంధబ్బంగా ఆయన కోరారు.

## ప్రత్యేక ఆధార్ క్యాంపు ఏర్పాటుచేయండి

ముద్దనూరు, నవంబర్ 06, ప్రభాతవార్త:



ముద్దనూరు మండలంలోని పాఠశాల విద్యార్థుల ఆధార్ కార్డులో సవరణల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుంద రెడ్డికి బుధవారం నాడు మండల విద్యా శాఖ అధికారులు సుబ్బారావు, నాగేశ్వర నాయక్‌లు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని తాత్కాలిక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని వారితో ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ మరియు మానిటరింగ్ సభ్యులుగా పాలకుంట శ్రీనివాసులు

పీలేరు, నవంబరు 06 ప్రభాతవార్తః



విజిలెన్సు అండ్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన పాలకుంట శ్రీనివాసులు నియమితులైయ్యారు. ఈమేరకు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయి. గత పదిహేను సంవత్సరాలుగా పాలకుంట శ్రీనివాసులు దళిత ఉద్యమంలో క్రియా శీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం బాస్ సంస్థలో జిల్లాకో కన్వీనర్‌గా పనిచేస్తున్నారు. ఇతను,దళిత సమస్యలుపై అలుపెరగని పోరాటం చేసిన శ్రీనివాస్‌కు ఈఅవకాశం రావడం దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మండల స్థాయి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా పీలేరు నియోజకవర్గ పీలేరు, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, గుర్రంకొండ, మండలాల్లో ఆయన అందించిన ఉత్తమ సేవలను గుర్తించి ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈసందర్భంగా పాలకుంట శ్రీనివాస్ మాట్లాడుతూ బాస్ సంస్థలో సముచిత స్థానం కల్పించి తద్వారా జిల్లా విజిలెన్సు అండ్ మానిటరింగ్ సభ్యులుగా ఎంపిక కావడం కొసిచేసిన బాస్ వ్యవస్థాపకులు పీటీఎం శివప్రసాద్ తన నియామకానికి సహకరించిన శాసన సభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి డీవియంసీలో తనకు చోటు కల్పించిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి కతజ్ఞతలు తెలియజేశారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎస్సీ, ఎస్టీ సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా పనిచేస్తానని చెప్పారు.





వైఎస్ఆర్ జిల్లా నూతన కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ లోని అన్ని వివిధ విభాగాలను డా. శ్రీధర్ చెరుకూరి.. పరిశీలించారు. కలెక్టరేట్ లోని కంట్రోల్ రూమ్, ఎన్.ఐ.సీ. సెంటర్, జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, పిజిఆర్ఎస్ హాలు, బోర్డు మీటింగ్ హాల్, విసి హాల్ లతో పాటు అన్ని సెక్షన్లకు చెందిన కార్యాలయాలను జిల్లా కలెక్టర్.. జిల్లా జేసి అదితి సింగ్ తో కలిసి.. పరిశీలించారు.

## ఈ నెల 8న రైతు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల సమావేశం విజయవంతం చేద్దాం

**- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి**

**గాలివీడు, నవంబర్ 6(ప్రభాతవార్త):**



దేశంలో మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజాసమస్యల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26వ తేదీన దేశవ్యాప్తంగా నిరసనలు విజయవంతం చేయాలని కోరుతూ ఈ నెల 8వ తేదీన రాయచోటిలో రైతు, కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశానికి విజయవంతం చేద్దామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం గాలివీడులో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేదన్నారు. వ్యవసాయరంగంలో కార్పొరేట్లకు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను తీసుకొస్తే రైతుల పోరాట ఫలితంగా పార్లమెంట్ ఆమోదం పొందలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా సీఎం చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. జాతీయ రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు రాష్ట్రంలోనూ రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, వివిధ రంగాలకు చెందిన కార్మికులందరూ పెద్ద ఎత్తున అర్జీలతో కేంద్రానికి ఈ నెల 26న హెచ్చరికలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



**మైదుకూరు, నవంబర్ 06,ప్రభాతవార్త:**

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా నూనె గింజలలో వేరుశనగ రకం కె-1812 విత్తనాలను పంపిణీ చేశారు. సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి బాలకృష్ణ,వేరుశనగ పంట శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ పంటల విత్తన శుద్ధి ప్రాముఖ్యత,విత్తన మోతాదు,విత్తే దూరం,సమగ్ర పోషణ యాజమాన్యం, నేల తయారీ విధానం, సైక్ష్మ పోషక యాజమాన్యం,కలుపు యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల ఒక నెల రోజుల వరకు పురుగు నుండి కాపాడుకోవచ్చని తెలియజేశారు.డాక్టర్ శ్రీ విద్యారాణి, వేరుశనగలో చేపట్టే సమగ్ర పురుగుల మరియు తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు.అంతర పంటలు మరియు ఎర పంటలు వేసుకోవాలని తెలియజేశారు. వేరుశనగ విత్తనాలను దువ్వూరు, బ్రహ్మంగారిమఠం, మండలాల్లోని రైతులకు పంపిణీ చేయడం జరిగింది.అంతేకాకుండా క్షేత్ర ప్రదర్శనలు చేసి తగు సూచనలను రైతులకు అందిస్తామని తెలియజేశారు.

## దుత్తలూరులో పోషణ అభియాన్ కార్యక్రమం

**జమ్మలమడుగు, నవంబరు 6, ప్రభాతవార్త:**



జమ్మలమడుగు మండల పరిధిలోని దుత్తలూరు అంగన్‌వాడీ సెంటర్‌లో అంగన్‌వాడీ టీచర్ ముంతాజ్ బేగం నిర్వహించిన ఐసీడీఎస్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, మనబడి మన స్వచ్ఛత, తల్లిపాలపై అవగాహన కల్పించారు. అలాగే గర్భవతి తీసుకోవాల్సిన ఆహారం, ఆరు నెలలు పిల్లలు ఆహారపు అలవాట్లు గురించి వివరించారు. పోషణ అభియాన్‌లో భాగంగా ఐసీడీఎస్ శ్రీకాంత్ పోషణ అభియాన్ ప్రోగ్రాం ప్రభుత్వం అందిస్తున్న బాలామృతం ఉపయోగాలు, ఆరు నెలల పిల్లల ఆహారపు అలవాట్లు తదితర అంశాల గురించి వివరించారు. బాలామృతం ప్రతి రోజు వంద గ్రాములు అందించాలని ఇది పిల్లలు తగిన ఎత్తు, బరువు పెరుగుటకు సహాయపడుతుందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌసియా అంగన్‌వాడీలో లభించే గుడ్లు, పాలు, గర్భవతులకు బాలసంజీవి కిట్ వాటి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహిళా పోలీస్ నాగలక్ష్మి, బాల్య వివాహాలు గురించి వివరించడం జరిగింది.

## హైవే రోడ్డు పక్కన హైటెక్ చోరీ

**- రోజు రోజుకు పెరుగుతున్న చోరీలపై పోలీసు నిఘా**

**ఓబులవారిపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:**



కడప-చెన్నై ప్రధాన జాతీయ రహదారి హైటెక్ రోడ్డు పక్కన హైటెక్ చోరీ జరిగింది. ముక్కవారిపల్లె గ్రామంలోకి ముఖ ద్వారం ఎడమవైపు ఉన్న ముగ్గురు అన్నదమ్ములకు సంబంధించిన గృహాలు అత్యంత సుందరంగా నియమించుకున్నారు. అయితే మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇళ్లకు సంబంధించిన బీగాలు పగలగొట్టి అందులో తలుపులను గడ్డపారలతో కొట్టి ఇంట్లోకి ప్రవేశించి అందులో ఉన్న మూడు తులాల బంగారు చైన్లు, కమ్మలు, నగదు చోరీకి గురైనట్లు ఓబులవారిపల్లె ఎస్సై మహేష్ తెలిపారు. ఈ చోరీకి సంబంధించి ఆనవాళ్లు గుర్తించేందుకు చోరీకి పాల్పడిన దొంగల చేతివేళ్ల ముద్రలను కూడా గుర్తించేందుకు ఫింగర్ ప్రింట్ పోలీసులు రవీంద్రారెడ్డి తన టీంతో రంగ ప్రవేశం చేశారు. అంతేకాకుండా హైటెక్ దొంగలు విలువైన బంగారం తప్ప వెండి, ఇత్తడి ఇతరత్రా వస్తువులు ఏమీ తాకలేదని కేవలం బంగారు మాత్రమే ఎత్తుకెళ్లినట్లు సూచించారు. అదే విధంగా పక్కన ముక్కా సుదర్శన్‌రెడ్డి ఇంటిలో కేవలం తలుపులు తెరిచేందుకు ప్రయత్నించగా ఆ తలుపులు రాకపోవడంతో దొంగలు వినిదిరిగారని తెలుస్తోంది. ఏది ఏమైనా చోరీకి పాల్పడింది హైటెక్ దొంగలేన్న సమాచారం. ఈ దొంగలు హైవే రోడ్లు చివరిగా ఉన్న ఇళ్లు ఏకాంతంగా కట్టుకొని ఉన్న ఇళ్ల తాళాలు వేసిన ఇళ్లకు మాత్రమే చోరీకి పాల్పడుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా మండలంలో ఆరు నెలల లోపే దాదాపు 4, 5 చోట్ల బంగారం, నగదు చోరీ అయ్యాయని తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పోలీసులు జాగ్రత్త చర్యలు తీసుకొని రాత్రివేళల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు పోలీసు అధికారులను కోరుతున్నారు.

## గాదెలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**ఓబులవారిపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త:**



గాదెల పంచాయతీలో పొలం పిలుస్తోందనే కార్యక్రమం మండల అధికారి అగ్రికల్చర్ ఆఫీసర్ ఏవో బి. మల్లిక విలేజ్ ఆర్టికల్చర్ అసిస్టెంట్ వై.వెంకటేష్ ప్రకృతి వ్యవసాయం చేసే సిబ్బంది బుల్లయ్య హాజరవడం జరిగింది. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మట్టి నమూనా రైతు బొమ్మయ్యగారి నరసింహులు పొలంలో మట్టి నమూనా తీయడం జరిగింది. బి.మల్లిక రైతులకు మట్టి నమూనా గురించి చెప్పడం జరిగింది. ప్రతి రైతు కూడా మట్టి నమూనా చేయించుకోవాలని రైతులందరికీ చెప్పడం జరిగింది. భూమికి ఏ పోషకాలు అవసరమో అందించడానికి ఈ మట్టి నమూనా చేయించుకోవాలని ప్రతి రైతు కూడా చేయించుకోవాలని ఏవో మల్లిక చెప్పారు. ప్రకృతి వ్యవసాయం గురించి బీజామృతం ఘనజీవామృతం ద్రవజీవామృతం తెగుళ్లకు కషాయాలు గురించి ఏవో అగ్రికల్చర్ మండల అధికారి మల్లికా మాట్లాడడం జరిగింది. ప్రతి రైతు కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువ తీసుకోవచ్చని చెప్పడం జరిగింది. ప్రతి రైతు పశువులు ఎరువుతో పండించే పంటలు ఎక్కువ నెలలు ఉంటాయి. ప్రతి రైతు ఇలా అలవాటు పడాలని ఎంసీఏ బులయ్య చెప్పారు. కార్యక్రమంలో గంగాధర్ పాల్గొన్నారు.

## పుట్లంపల్లి, మీరాపురంలో పొలం పిలుస్తోంది



**కమలాపురం, నవంబరు 6, ప్రభాతవార్త:**

మండల పరిధిలో పుట్లంపల్లి, మీరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరి మరియు మినుము పంటలను పరిశీలించారు. చిరుపొట్ట దశలో వరి పొలాన్ని సందర్శించినప్పుడు ఆకుముడత పురుగును గమనించడం జరిగింది. ఆకులను నిటారుగా ముడత చేసుకొని పత్ర హరితాన్ని గోకి తినడం వలన ఆకుల మీద తెల్లని చారలు ఏర్పడి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగజేస్తుంది. ఆకుముడత గమనించినప్పుడు తాడును పట్టుకొని ఇటు, అటుగా రెండు, 3 సార్లు లాగడం వలన ఆకు ముడతలోని గొంగళి పురుగులు నీళ్లలో పడిపోయి చనిపోతాయి. ఎసిఫేట్ 300 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు లేదా క్లోరంత నిలిప్రోల్ 60 మి.లీ మందును 200 లీటర్ల నీటి ద్రావణంలో కలుపుకొని ఒక ఎకరా పంటకు పిచికారి చేసుకోవాలని తెలిపారు. రబీ సాగుకు అనువైన వరి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. నవంబరు 15 నుంచి డిసెంబరు 15 వరకు వరి నాట్లను వేసుకోవడానికి అనుకూలమని, 21 నుంచి 25 రోజుల వరి నారు ప్రధాన పొలంలో నాటినట్లయితే పిలకలు బాగా వస్తాయని, తగిన ఎరువుల యాజమాన్య పద్ధతులను, సస్యరక్షణ చర్యలను పాటించినట్లయితే మంచి దిగుబడిని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఏవవీ నరసింహారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు దస్తగిరి, శివరంజని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై జరిగిన గ్రామసభలు విజయవంతం

**కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:**



మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో బుధవారం ఎంపీడీవో భానుమూర్తిరావు ఆదేశాలతో ఏపీవో సుజాత పర్యవేక్షణలో జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామ సభలు విజయవంతమయ్యాయి. కలికిరి మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడంతో మండలంలోని కూలీలు పనుల కోసం బయటికి వలస పోకుండా వారికి గ్రామాల్లోనే పనులు కల్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించి కూలీలకు పనులు కల్పించాలని ఆదేశించడంతో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలు స్థానిక సర్పంచ్ అధ్యక్షతన జరిగాయి. ఈ గ్రామ సభలో కూలీలకు ఉపాధి హామీ పథకం పనులను ఎంపిక చేయడం జరిగింది. గ్రామసభలకు ప్రజా ప్రతినిధులు, కూలీలు, రైతులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో గ్రామసభలు విజయవంతం అయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఎ.రెడ్డిరామ్, సైఫుల్లా, రెడ్డమ్మ, శశికళ, నాగమణి, అరుణ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, తెదేపా నాయకులు వాసనూరి చిన్నరెడ్డయ్య, కొటాల చల్లయ్య, శ్రీనివాసులు, శంకరయ్య, వెంకటపతి, పలువురు నాయకులు, పంచాయతీ కార్యదర్శులు నవాజుల్లా, మయూరి, జనీఫారాణి, తిమ్మారెడ్డి, గిరిబాబు, టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డి బాషా, మనోహర్, బుజ్జమ్మ, రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## టీడీపీ చొరవతో మంచినీటి సమస్య పరిష్కారం

**కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:**



మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలోని గాజులబండ కురవపల్లె, తనుకవారిపల్లె గ్రామాల్లో రాజంపేట పార్లమెంట్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్ చొరవతో గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కారమైంది. 2 గ్రామాల్లో మంచినీటి సమ్యలు తలెత్తడంతో వెంటనే యువనేత పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రెండు గ్రామాల్లో రక్షిత మంచినీటి బోర్లకు కొత్త మోటార్లు అమర్చి సమస్య పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, తెదేపా సీనియర్ నాయకులు వాసనూరి చిన్నరెడ్డయ్య, కొటాల చల్లయ్య, వెంకటపతి, పంచాయతీ కార్యదర్శి నవాజుల్లా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త విధిగా టిడిపి సభ్యత్వ నమోదు చేయించాలి

**వీరబల్లి,నవంబర్06,ప్రభాతవవార్త :**



మండలంలోని ప్రతి గ్రామ పంచాయితీకి చెందిన ప్రతి కార్యకర్త విధిగా టిడిపి సభ్యత్వ నమోదు చేయించాలని టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్ రాజు తెలిపారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సహ్యాత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమములో వీరబల్లి మండలం 100శాతం చేయించాలని తెలిపారు. ప్రతి టిడిపి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేసి టిడిపి సభ్యత్వం నమోదు చేయాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమమంలో టిడిపి నాయకులు ఎర్రపురెడ్డి సురేంద్రా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు భాస్కర్ రాజు, శివకుమార్ నాయుడు, రాజరాజు, మాజీ సర్పంచ్ మల్లికార్జున, సీతారామరాజు, సిద్దిరాజు, రవిరాజు, లక్ష్మీరెడ్డి, రెడ్డెయ్య రాజు, సాయిరా రాజు, రమణ, వినయ్,శివ, రామక్రిష్ణంరాజు, నరశింహులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి మండల తహసీల్దారుగా మాధవీలత

**సిద్దవటం, నవంబరు 6, ప్రభాతవార్త:**



సిద్దవటం మండల ఇన్‌ఛార్జి తహసీల్దారుగా మాధవీలత బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన మురాద్‌షావలీ పదవి విరమణ కావడంతో ఆ స్థానంలో ఇన్‌ఛార్జి తహసీల్దారు మాధవిలతకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో భూ కబ్జాలను కట్టడి చేస్తామని సిబ్బందితో కలిసి పని చేస్తానని ఆమె తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన కుల ఆదాయ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను నిర్ణీత సమయంలో అందజేస్తామని గ్రామ, సచివాలయాల్లో వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు.

## బిజెపి క్రియాశాలక సభ్యత్వాలు నమోదు

**టి.సుండుపల్లి, నవంబరు 6, ప్రభాతవార్త :**



మండలంలోని పార్లమెంట్ బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ చేతుల మీదుగా రాజంపేట బిజెపి అసెంబ్లీ కన్వీకర్ రామా జగదీష్, క్రియా శాలక సభ్యతంతో పాటు రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ సుబ్బరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సుబ్బరామరాజు, సీనియర్ నాయకుడు సత్యంనాయుడులు క్రియా శీలక సభ్యత్వాలు నమోదు తీసుకోవడం జరిగింది. ఈ సందరబంగా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ మాట్లాడుతూ సుండుపల్లి మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకొని త్వరితగతిన సభ్యత్వాలు నమోదు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమమంలో మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షబ్బీర్ అహమ్మద్‌చ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుబ్బరాయుడు బిజెపి నాయకుడు రమణయ్య, రామక్రిష్ణ, మహిళా మోర్చా నాయకురాలు అమృతవల్లి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామసభలు ద్వారా ప్రజాసమస్యలు గుర్తింపు

**మదనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :**



గ్రామసభలు నిర్వహిస్తున్న దృశ్యం

గ్రామసభలు ద్వారా ప్రజా సమస్యలు గుర్తించి ప్రజా అవసరాల మేరకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి తెలిపారు. బుధవారం కురవంకలోని గ్రామ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా గ్రామసభల్లో గుర్తించిన పనులకు రూ.36లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇంకా గ్రామంలో చేపట్టాల్సిన పనులకు గానూ ప్రజల నుండి ధరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. గ్రామాభివృద్దే ప్రధాన లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. వార్డుసభ్యులు, అధికారుల సహకారంతో గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా శానిటేషన్, నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ షబానా, వార్డుసభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

**ఎక్సైజ్ సిఐ భీమలింగ**

**మదనపల్లెక్రైం, నవంబర్ 6 ప్రభాతవార్త :**



మదనపల్లె ఎక్సైజ్ పరిధిలోని పట్టణ, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎక్సైజ్ సిఐ భీమలింగ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లడుతూ సర్కిల్ పరిధిలో 22 ప్రైవేటు మద్యం దుకాణాలకు రెండేళ్ళపాటు పర్మనెంట్ లైసెన్స్‌లు జారీ చేస్తున్నామన్నారు. ఈ దుకాణాల్లో వ్యాపారులు ఎంఆర్‌పి ధరలకే మద్యంను విక్రయాలు జరపాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు 100మీటర్ల దూరంలోపు మద్యం దుకానాలు ఏర్పాటు చేయరాదన్నారు. దుకాణదారుడు ఎవరైనా బెల్టుషాపనులకు మద్యం విక్రయించినట్లు తమ తనిఖీల్లో తేలితే వారిపై కేసులు నమోదు చేస్తామని సిఐ తెలిపారు.

## మండల సమావేశంను విజయవంతం చేయండి

**నిమ్మనపల్లె, నవంబర్ 6 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె మండల సర్వసభ్యసమావేశం ఎంపిపి నరసింహులు అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి నేడొక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11గంటలకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రకాశం జిల్లా వాసి మదనపల్లెలో మృతి

**మదనపల్లెక్రైం, నవంబర్ 6 ప్రభాతవార్త :**



ప్రకాశం జిల్లావాసి మదనపల్లెలో మృతి చెందినట్లు బుధవారం ఉదయం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ రామచంద్ర తెలిపారు. సింగరాయకొండ సెల్ టవర్‌వీధిలో కాపురం ఉండే షేక్ రెహమాన్ కొడుకు షేక్ నజీర్ అహమ్మద్(66) మదనపల్లె ఆర్టీసి బస్టాండు ఆవరణంలో చనిపోయి ఉండగా, అందిన సమాచారం మేరకు వెంటనే వెళ్లి మృతదేహన్ని పరిశీలించామన్నారు. మృతుని జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతిచెందిన వ్యక్తి ప్రకాశంజిల్లా సింగరాయకొండ సెల్‌టవర్ వీధిలో కాపురం ఉన్న షేక్ నజీర్‌అహ్మద్‌గా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. మృతదేహన్ని స్థానిక జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారను. బంధువులు మదనపల్లె రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐని ఆశ్రయించి మృతదేహన్ని తీసుకెళ్ళవచ్చునన్నారు.

## టెంపో ఢీ కొని లైన్‌మెన్‌కు తీవ్రగాయాలు

**ములకలచెరువు, నవంబర్ 6 ప్రభాతవార్త :**



ములకలచెరువు వద్ద మంగళవారం రాత్రి టెంపో ఢీ కొనడంతో తంబళ్ళపల్లె లైన్‌మెన్ తీవ్రంగనా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు. ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయితీ, రెడ్డివారిపల్లెకు చెందిన బి.అప్పిరెడ్డి(52) తంబళ్ళపల్లె ట్రాన్స్‌కో విభాగంలనో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులు నిర్వహించి ఇంటికి వచ్చేందుకు బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరి వస్తుండగా మార్గమధ్యంలోని దేవలచెరువు వద్ద టెంపో బైకును ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రున్ని చికిత్సల నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

## ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

**పుల్లంపేట, నవంబర్06,ప్రభాతవవార్త :**



మండలంలోని కస్తూరిభా విద్యాలయం, మోడల్ పాఠశాలలను రైల్యే కోడూరు శాసనసభ్యుడు అరవ శ్రీధర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలసూ్త వంటగది, బాత్ రూములను తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఆడపిల్లలకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా తక్షణ చర్యలు తప్పవని పేర్కొన్నారు. మెరుగైన వసతి కల్పనకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని పరిశుభ్రతతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యతను ఇవ్వాలని ఆయన కోరారు. ఆకస్మిక తనిఖీలు తరచూ చేస్తామని ఏమాత్రం అలక్ష్యం వహించినా కఠిన చర్యలు తతీసుకుంటామని అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు టిడిపి నియోజకవర్గ నాయకుడు రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి సీతమ్మపల్లె చెందిన టిడిపి నాయకుడు చంద్ర పాల్గొన్నారు.

## నేడే మండల సర్వసభ్య సమావేశం

**టి.సుండుపల్లి, నవంబరు 6, ప్రభాతవార్త :**

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం నందు మండల సర్వసభ్య సమావేశం నేటి ఉదయం 10గంటలకు నిర్వహించబడునని కావునా మండలంలోని అన్ని పంచాయితీల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు, అన్ని గ్రామ పంచాయితీల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, అందరూ తప్పక హాజరు కావాలని ఎంపీడీఓ ఒక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు

**వేంపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త ః**



ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు అధికంగా కలుగుతాయని జిల్లా ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్టు డీసీపీ నీరజారెడ్డి అన్నారు. వేంపల్లె శివారు ప్రాంతంలో రైతు శాస్త్రవేత్త అజితకుమారి ప్రకృతి వ్యవసాయ పొలాన్ని ఆమె సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులైన పీఎండీఎస్, 365 రోజులు భూమిని కప్పి ఉంచడం, మల్చింగ్, ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్, ఘన ద్రవ జీవామృతం, తదితర పద్ధతులు పాటించడం ద్వారా రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెంటార్లు జంగయ్య, బాబు, పావని, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆదాల పై ప్రత్యేక సమావేశం

**రైల్వేకోడూరు,నవంబర్ 06,ప్రభాతవార్త:**



రైల్వేకోడూరు మండలంలోని విద్యుత్ సబ్స్టేషన్ వద్ద ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి చైర్‌పర్స న్‌గా శ్రీనివాస ఆంజనేయ మూర్తి, కే రామ్మోహన్,ఎస్ఎల్ అంజనీ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యుత్ అదాలత్ పై వినియోగదారుల సమస్యలను పరిష్కరించారు.ఈ సందర్భంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎన్ రాజశేఖర్ రెడ్డి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ వ్యవస్థ ద్వారా వినియోగదారులు సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశానికి కోడూరు రూరల్ చిట్వేల్, ఓబులవారిపల్లె, పెనుగలూరు, పుల్లంపేట, రాజంపేట తదితర ప్రాంతాల నుండే కాకుండా నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం సెక్షన్లకు సంబంధించిన విద్యుత్ అధాలత్ నిర్వహించబడినది.ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఏడి భాస్కరరావు ఏఈలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

**వేంపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త ః**



రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి క్షీణించిందని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూతల ప్రభుత్వంగా, బాదుడు ప్రభుత్వంగా తయారైందన్నారు. చిన్నారులు, మహిళల మీద అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యం అయ్యాయని అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన శాఖ నిర్వహణలో విఫలం అయ్యారన్నారు. కూటమి ఇచ్చిన నిరుద్యోగ భృతి అతీగతీ లేదని, తల్లివందనం నిల్.. తండ్రికి ఇంధనం ఫుల్ అన్నారు. ఇంటింటా సౌభాగ్యం వెల్లి విరియాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.

## ప్రభుత్వాధినేతలను గుర్తించని ప్రభుత్వ అధికారులు

**వేంపల్లె, నవంబరు 6, ప్రభాతవార్త ః**



ఐదు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల చిత్రపటాలు ఎందుకు ఉంచలేదని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర అధికారులను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన వేంపల్లెలోని ఎంఈవో కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలు ఎందుకు ఉంచలేదని చెప్పి ఎంఈవోను అడగగా మీరే తెచ్చి ఉండండి అని సమాధానం ఇవ్వడంతో ఆయన సూచన మేరకు అక్కడ ఫోటోలు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మారినప్పుడు వారి కార్యాలయాల్లో ఎవరు ఉంటే వారి చిత్రపటాలు ఉంచడం ఆనవాయితిగా వస్తున్న సందర్భంలో మండల విద్యాశాఖ అధికారికి ఆ విషయం తెలియదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నామా వేమకుమార్, డక్కా రమేష్, రాజుల పవన్‌కుమార్, యెడాల జగదీష్, భాస్కర్, బాబా, ప్రశాంత్, వెంకటేష్, బాబు పాల్గొన్నారు.

## శనగలో కంచెపంటగా జొన్న సాగుచేయాలి



**కొండాపురం, నవంబరు 6, ప్రభాతవార్త ః**

రైతులు శనగపంటకు కంచెపంటగా నాలుగు సాళ్లు జొన్న పంట సాగుచేయాలని ముద్దనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య అన్నారు. కొండాపురం మండలంలోని సుగుమంచిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం మండల వ్యవసాయాధికారి రామాంజులరెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. రైతుల పంట పొలాలను పరిశీలించి వారు మాట్లాడుతూ శనగపంటలో నెల రోజుల్లోపు వేప గింజుల కషాయాన్ని లీటరు నీటికి 5మి.లీలు కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఇలా చేస్తే శనగపచ్చ పురుగు పెట్టినా గుడ్లు పొదగకుండా అరికట్టవచ్చన్నారు. అలాగే ఎర్రపంటగా బంతిపూలు వేసకున్నట్లైతే శనగపచ్చ పురుగును అరికట్టవచ్చని తెలిపారు. రైతులు ఎప్పుడూ ఒకే పంట సాగుచేయడం వలన భూసారం దెబ్బతింటుందని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శివనారాయణ, రైతులు పాల్గొన్నారు.

**- వీరపునాయునిపల్లె ః** మండలంలోని యు.రాజుపాళెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శ్యాంబాబు రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వరిపంటలో కాండం తొలుచు పురుగు, ఆకునల్లి, పాము పొడ తెగులు గమనించామని, నివారణకు పిచికారి చేయాల్సిన మందుల గురించి వివరించారు. మినుము పంట పరిశీలించి సాగులో మెళకువల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి



**పులివెందుల రూరల్, నవంబరు 6, ప్రభాతవార్త ః**

పులివెందులలోని శిల్పారామం, ఉలిమెళ్ల లేక్‌లలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఈవో స్వామినాయుడు ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన పులివెందులలో పర్యటించారు. ఈ సంరద్భంగా పరిపాలనాధికారి సుధాకర్, సిబ్బందితో పలు విషయాలపై చర్చించారు. శిల్పారామం, ఉలిమెళ్ల లేక్‌లలో అభివృద్ధికి అవసరమైన అనుమతుల కోసం వెంటనే నివేదిక ఇవ్వాలని తెలిపారు. బోటింగ్ చేసే వారు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వెంకట సుబ్బయ్య, ఫీల్డ్ సూపర్‌వైజర్లు ఇస్మాయిల్, సుబ్బరావు, వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

## జేఎన్‌టీయూ ప్రిన్సిపల్‌గా విష్ణువర్ధన్

**పులివెందుల రూరల్, నవంబరు 6, ప్రభాతవార్త ః**



పులివెందుల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్‌గా విష్ణువర్ధన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ప్రిన్సిపల్‌గా ఉన్న అరుణకాంతి బదిలీ కావడంతో ఆమె స్థానంలో ప్రొఫెసర్ విష్ణువర్ధన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌కు అనంతపురం జేఎన్‌టీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్‌రావు, డైరెక్టరు ప్రొఫెసర్ భానుమూర్తి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## నేడు కలికిరికి కలెక్టర్ రాక

**కలికిరి, నవంబరు 6, ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ గురువారం ఉదయం 9.30 గంటలకు కలికిరి ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

